


# నేటి దిక్సూచి

www.netidiksuchi.com

తెలుగు దినపత్రిక

TGTEL/25/A3190




ప్రచురణ. రంగారెడ్డి, సంపుటి:01 సంచిక :184 ఎడిటర్ పి. అలివేలు పేజిలు : 04, వెల. 2రూ/ మంగళవారం- 04 - ఆగస్టు - 2026

## కర్ణాటక కేబినెట్ విస్తరణతో కాంగ్రెస్‌లో తీవ్ర అసమ్మతి



- చివరి నిమిషంలో జాబితా నుంచి మంకాల్ వైద్య పేరు తొలగింపు
- సీనియర్ లింగాయత్ నేత ఎస్.ఎస్. మల్లికార్జున్‌కు చోటు
- పదవులు దక్కని ఎమ్మెల్యేలు రాజీనామా చేస్తామని హెచ్చరిక
- ఎమ్మెల్యే తన్వీర్ సేట్ మద్దతుదారుడి ఆత్మహత్యాయత్నం

## బంకీపూర్ ఉపఎన్నికలో ప్రశాంత్ కిషోర్ సంచలన విజయం

- బిహార్‌లోని బంకీపూర్ శాసనసభ ఉపఎన్నికలో జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిషోర్ సంచలన విజయం సాధించారు.
- గత 30 ఏళ్లుగా కంచుకోటగా ఉన్న ఈ నియోజకవర్గంలో పీకే గెలుపు జెండా ఎగరేశారు.

పాట్నా, ఆగస్టు 03: బిహార్‌లోని బంకీపూర్ శాసనసభ ఉపఎన్నికలో జన్ సురాజ్ పార్టీ



అధినేత ప్రశాంత్ కిషోర్ (ఫ్రాఖ) సంచలన విజయం సాధించారు. గత 30 ఏళ్లుగా కంచుకోటగా ఉన్న ఈ నియోజకవర్గంలో పీకే గెలుపు జెండా ఎగరేశారు. ప్రశాంత్ కిశోర్ తన సమీప బీజేపీ అభ్యర్థి నీరజ్ సిన్హాపై 18,953 ఓట్ల భారీ తేడాతో ఘన విజయం సాధించారు. నేడు కౌంటింగ్ మొదలైనప్పటి నుంచీ బీజేపీ నేత నీరజ్ కుమార్ కంటే ముందంజలో ఉన్న ప్రశాంత్ కిశోర్ ఒక్కో రౌండ్ ముగిసేసరికి తన ఆధిక్యాన్ని అంతకంతకూ పెంచుకున్నారు. పీకేకు 63,203 పోలయ్యాయి. అలానే రెండో స్థానంలో నిలిచిన బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్ కు 44,250, మూడో స్థానంలో నిలిచిన ఆర్జేడీ అభ్యర్థి రేఖ కుమారి 14,085 ఓట్లు సాధించారు.

## ట్రంప్ ముందు సౌదీ కీలక అభ్యర్ధన..
# భయపడిందా?

- ఇరాన్‌పై భారీ దాడులు జరగొచ్చని ట్రంప్ సంకేతాలు ఇచ్చారు.
- చివరి నిమిషంలో వెనక్కి తగ్గారు. ఇరాన్ చర్చలకు రావడంతో వెనక్కి తగ్గినట్లుగా ట్రంప్ ప్రకటించారు.
- దీంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లబడ్డాయి.



ఢిల్లీ : తాజాగా సౌదీ అరేబియా ట్రంప్ ముందు కీలక అభ్యర్థన పెట్టినట్లుగా తెలుస్తోంది. ఇరాన్‌పై మరిన్ని దాడులు చేపట్టకుండా వెనక్కి తగ్గాలని సౌదీ అరేబియా యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను కోరినట్లు అమెరికా అధికారులు వెల్లడించారు. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిణామాలు సౌదీ అరేబియా ప్రతిష్ఠాత్మక ఆర్థిక ప్రణాళిక 'విజన్ 2030'పై ప్రభావం మిగతా..2లో

## ఆ కోల్ బ్లాక్ సింగరేణికి దక్కడం సంతోషకరం



- 2 డిప్‌సైడ్ కోల్ బ్లాక్ సింగరేణికి దక్కడం సంతోషకరమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

ఢిల్లీ, ఆగస్టు 3 : 2 డిప్‌సైడ్ కోల్ బ్లాక్ సింగరేణికి దక్కడం సంతోషకరమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సింగరేణి కార్మికులకు, కార్మికుల కుటుంబ సభ్యులకు, కార్మిక సంఘాల ప్రతినిధులకు, సింగరేణి అధికారులకు. తెలంగాణ ప్రజలకు అభినందనలు తెలిపారు. ఈ మేరకు కిషన్‌రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. ఇటీవల.. ఒడిశాలోని నైని కోల్ బ్లాక్, తాడిచర్ల -2 బ్లాక్ సింగరేణి సిగలో చేరిన సందర్భంలో.. 2 డిప్ సైడ్ బ్లాక్‌ను కూడా సింగరేణికే దక్కేలా చొరవ తీసుకోవాలని కార్మికులు, యూనియన్ లీడర్ల నుంచి డిమాండ్లు వచ్చాయని ప్రస్తావించారు. ాఖూజ-2 డిప్‌సైడ్ బ్లాక్ సింగరేణికి

## నిమ్స్‌లో రెండున్నరేళ్లలో
# వెయ్యి రొబోటిక్ శస్త్రచికిత్సలు పూర్తి

- నిమ్స్‌లో రెండున్నరేళ్లలో 1,000 రొబోటిక్ సర్జరీలు పూర్తి అయ్యాయని తెలంగాణ మంత్రి దామోదర రాజనర్సింహ వ్యాఖ్యానించారు.
- సోమవారం రాష్ట్ర సచివాలయంలో నిమ్స్ వైద్య బృందం మంత్రిని కలిశారు.



మిగతాది 2లో

హైదరాబాద్, ఆగస్టు 3: నిమ్స్‌లో రెండున్నరేళ్లలో వెయ్యి రొబోటిక్ శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి అయ్యాయని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ ఘనత సాధించినందుకు నిమ్స్ డైరెక్టర్ రాహుల్ దేవరాజ్ తో పాటు వైద్య బృందం, నర్సింగ్ సిబ్బంది, ఆపరేషన్ థియేటర్ బృందానికి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే ప్రజా ప్రభుత్వ సంకల్పం నెరవేరిందని వ్యాఖ్యానించారు. నిమ్స్ లో ఇప్పటివరకు నిర్వహించిన రొబోటిక్ సర్జరీల్లో 90 శాతానికి పైగా ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఉచితంగా నిర్వహించడం ప్రత్యేకంగా అభినందించాల్సిన విషయమని సీఎం పేర్కొన్నారు. ఇటీవలే రెండు వేల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను పూర్తి చేసిన నిమ్స్, ఇప్పుడు వెయ్యి రొబోటిక్ సర్జరీల మైలురాయిని చేరుకోవటం ద్వారా కొత్త రికార్డు నెలకొల్పిందని చెప్పుకొచ్చారు. వైద్య రంగంలో నిమ్స్ మరిన్ని మైలురాళ్లు సాధించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. నిమ్స్‌లో రెండున్నరేళ్లలో 1,000 రొబోటిక్ సర్జరీలు పూర్తి అయ్యాయని తెలంగాణ మంత్రి దామోదర రాజనర్సింహ వ్యాఖ్యానించారు.

## అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్ ప్రకటించి మోసం చేశారు..



- సీఎం రేవంత్‌పై కేటీఆర్ ధ్వజం
- అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్ ప్రకటించి కాంగ్రెస్ నేతలు మోసం చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

హైదరాబాద్, ఆగస్టు 3 : అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్ ప్రకటించి కాంగ్రెస్ నేతలు మోసం చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో ఈరోజు (సోమవారం) మీడియాతో కేటీఆర్ మాట్లాడారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నియోజకవర్గం మధిరలో గడ్డం వేణు అనే యువకుడు ఆత్మహత్యాయత్నం చేసుకున్నారని ప్రస్తావించారు. రెండు పేజీల మిగతా..2లో


## ఆంధ్రప్రదేశ్‌లో మూగజీవాల హింస.. పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి రష్మీ ట్వీట్



- ఎద్దులపై క్రూరత్వం అంటూ స్పందించిన యాంకర్ రష్మీ గౌతమ్
- వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన రష్మీ
- జోక్యం చేసుకోవాలని పవన్ కల్యాణ్, అధికారులకు విజ్ఞప్తి
- ప్రభావశీలుర ప్రమేయంతో మూగజీవాలకు న్యాయం జరగడం లేదని ఆవేదన
- నందులను పూజిస్తూ ఇలా హింసించడం తగదని వ్యాఖ్య

అమరావతి : ప్రముఖ టెలివిజన్ యాంకర్, జంతు హక్కుల కార్యకర్త రష్మీ గౌతమ్ ఆంధ్రప్రదేశ్‌లో ఎద్దుల పట్ల క్రూరంగా ప్రవర్తిస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఎద్దులతో బలవంతంగా భారీ బరువులు మోయిస్తున్న దృశ్యాలను సామాజిక మాధ్యమాల్లో పంచుకుంటూ, ఇటువంటి అమానవీయ చర్యలను అరికట్టాలని ఆమె రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి మిగతా..2లో


## మిస్టర్ డ్రామారావు" అంటూ కేటీఆర్ పై మంత్రి పొంగులేటి ఫైర్



- పెద్ది సుదర్శన్ రెడ్డి మరణంతో బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందని ఆరోపణ
- పదేళ్లలో మంత్రి పదవి ఇవ్వకుండా అవమానించారని విమర్శ
- అధికార లాంఛనాలతో గౌరవించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని వెల్లడి
- వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు గుణపాఠం చెబుతారని వ్యాఖ్య

హైదరాబాద్: తెలంగాణ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పొంగులేటి శ్రీనివాసరెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దివంగత ఉద్యమ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి మరణాన్ని కేటీఆర్ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని ఆరోపిస్తూ సోమవారం 'ఎక్స్' వేదికగా ఘాటు విమర్శలు చేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి జీవించి ఉన్నప్పుడు ఆయన్ని విస్మరించి, ఇప్పుడు ఆయన మరణంపై రాజకీయం చేస్తున్న 'మిస్టర్ డ్రామారావు' కేటీఆర్ అంటూ పొంగులేటి మండిపడ్డారు. మిగతా..2లో

## నేతన్న సేవలో పథకం అర్హులకు మంత్రి సవిత కీలక సూచన..



- ఆంధ్రప్రదేశ్ చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత ఆ శాఖ అధికారులతో సోమవారం మధ్యాహ్నం సమీక్షా సమావేశం నిర్వహించారు.
- 'నేతన్న సేవలో' పథకం అమలు, కార్యాచరణపై అధికారులతో చర్చించి వారికి దిశానిర్దేశం చేశారు.
- ఈ సందర్భంగా చేనేత కార్మికులకు మంత్రి సవిత కీలక సూచనలు చేశారు.

అమరావతి: ఆంధ్రప్రదేశ్ చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత ఆ శాఖ అధికారులతో ఇవాళ (సోమవారం)

## డేటా ఆధారిత పాలనకు
# ప్రాధాన్యం ఇవ్వాలి

అన్ని శాఖల్లో డేటా ఆధారిత పాలనకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు.

అమరావతి, ఆగస్టు 3 : అన్ని శాఖల్లో డేటా ఆధారిత పాలనకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆర్‌టీజీఎస్‌లో డేటా ఆధారిత నిర్ణయాలపై సీఎం చంద్రబాబు ఈరోజు (సోమవారం) సమీక్ష సమావేశం నిర్వహించారు. పై అధికారులకు సీఎం మార్గనిర్దేశం చేశారు. సీఎం సమీక్షకు ఏపీ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సాయిప్రసాద్, ఐటీ, ఆర్‌టీజీఎస్, వ్యవసాయం, మున్సిపల్, సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. రియల్ టైమ్ గవర్నెన్స్ వ్యవస్థ పనితీరుపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ఆర్‌టీజీ



ద్వారా పాలన మరింత సమర్థవంతంగా, సులభంగా ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రభుత్వ నిర్ణయాలతో డేటా వినియోగాన్ని పెంచాలని ఆదేశించారు. ఆయా శాఖల వారీగా డేటా సమన్వయంపై అధికారులతో సీఎం చంద్రబాబు చర్చించారు.

## అమరావతి ఐకానిక్ భవనాల నిర్మాణాలు గడువు ప్రకారం పూర్తి కావాలి



- ఐకానిక్ భవనాల నిర్మాణ పనులు పురోగతిపై నారాయణ సమీక్షా సమావేశం
- నిర్మాణాలు ఏయే దశల్లో ఉన్నాయో అధికారుల నుంచి తెలుసుకున్న నారాయణ
- వర్షాల కారణంగా నిర్మాణ పనులు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలన్న మంత్రి

అమరావతి : రాజధాని అమరావతి పరిధిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఐకానిక్ భవనాల నిర్మాణ పనుల పురోగతిపై పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. సీఆర్‌డీఏ ఉన్నతాధికారులు, ఇంజినీర్లు, నిర్మాణ కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులతో కలిసి పనుల తీరుతెన్నులను క్షుణ్ణంగా పరిశీలించారు. మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

## అమరావతి ఐకానిక్ భవనాల నిర్మాణాలు
# గడువు ప్రకారం పూర్తి కావాలి

ఈ సమావేశంలో ఏజీఐసీఎల్ ఎండీ అభిషేక్ కుమార్, ఇంజినీర్ ఇన్ చీఫ్ గోపాల్‌రెడ్డితో పాటు పలువురు చీఫ్ ఇంజినీర్లు పాల్గొన్నారు. అమరావతి ల్యాండ్‌మార్క్‌లుగా నిలవనున్న అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ టవర్ల నిర్మాణ పనులు ఏయే దశల్లో ఉన్నాయనే వివరాలను నారాయణ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం దృష్ట్యా నిర్మాణాలు నిలిచిపోకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటూ పనులను నిరంతరాయంగా కొనసాగిస్తున్నట్లు అధికారులు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువు (టార్గెట్స్) ప్రకారమే రాజధాని ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేయాలని, ఎక్కడా నాణ్యత లోపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కాంట్రాక్ట్ సంస్థలకు, అధికారులకు మంత్రి నారాయణ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

## నేతన్న సేవలో పథకం అర్హులకు మంత్రి సవిత కీలక సూచన..

మధ్యాహ్నం సమీక్షా సమావేశం నిర్వహించారు. 'నేతన్న సేవలో' పథకం అమలు, కార్యాచరణపై అధికారులతో చర్చించి వారికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులకు మంత్రి సవిత కీలక సూచనలు చేశారు. 'నేతన్న సేవలో' పథకానికి అర్హులు ఈ నెల 5వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గడువులోపు చేనేత కార్మికులందరూ దరఖాస్తులు చేసుకుని ప్రభుత్వం ఇచ్చే సాయాన్ని అందుకోవాలని మంత్రి సవిత విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఈ నెల 7న గుంటూరు జిల్లా చీరాలలో సీఎం చంద్రబాబు ఈ పథకాన్ని ప్రారంభించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. దీని ద్వారా ఏటా రూ.25 వేల ఆర్థికసాయాన్ని చేనేత కార్మికులకు అందించనున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో హామీ ఇవ్వకున్నా 'నేతన్న సేవలో' పథకాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేయబోతోందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. చేనేత కార్మికుల గౌరవప్రదమైన జీవనమే సీఎం చంద్రబాబు లక్ష్యమని ఈ సందర్భంగా సవిత చెప్పుకొచ్చారు. మరోవైపు, ఈ పథకం అమలులో ఆరోపణలు, విమర్శలకు తావు లేకుండా పని చేయాలని అధికారులకు మంత్రి సవిత సూచించారు. ఎలాంటి తప్పులు దొర్లకుండా పథకాన్ని పకడ్బందీగా అమలు చేసేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు.

## బంకీపూర్ ఉపఎన్నికలో
# ప్రశాంత్ కిషోర్ సంచలన విజయం

ఈ చరిత్రాత్మక విజయం అనంతరం ప్రశాంత్ కిషోర్ మాట్లాడుతూ.. తన గెలుపు బీజేపీ హైకమాండ్‌కు ఒక బలమైన సందేశమని వ్యాఖ్యానించారు. నేర చరిత్ర కలిగిన వ్యక్తిని బిహార్ ముఖ్యమంత్రిగా చేశారని తీవ్రస్థాయిలో మండిపడిన ఆయన, సామ్రాట్ చౌదరిని వెంటనే సీఎం పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ ఉపఎన్నిక ఫలితం బిహార్ రాజకీయాల్లో సరికొత్త మార్పునకు సంకేతమని ఆయన పేర్కొన్నారు. రాజ్యసభకు ఎన్నికైన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్.. బంకీపూర్ ఎమ్మెల్యేగా రాజీనామా చేశారు. దీంతో ఆ నియోజకవర్గానికి ఉప ఎన్నిక నిర్వహించారు. బీజేపీ కంచుకోటగా పేరున్న ఈ నియోజకవర్గంలో.. 1995 నుంచి బీజేపీ అభ్యర్థులే విజయం సాధిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రశాంత్ కిశోర్ అసాధారణ విజయం సాధించడం, బీజేపీ కంచుకోటలో జేఎస్‌పీ జెండా ఎగురవేయడం యావత్ దేశం దృష్టిని ఆకర్షించింది. ప్రశాంత్ విజయంతో.. జేఎస్పీ శ్రేణులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకుంటున్నాయి.

## నిమ్స్‌లో రెండున్నరేళ్లలో వెయ్యి రొబోటిక్ శస్త్రచికిత్సలు పూర్తి

ఈరోజు (సోమవారం) రాష్ట్ర సచివాలయంలో నిమ్స్ వైద్య బృందం మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా వారిని మంత్రి దామోదర అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర మాట్లాడారు. ప్రభుత్వాస్పత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలకు నిదర్శనమని పేర్కొన్నారు. ఇప్పటికే 2,000 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను నిమ్స్ పూర్తి చేసిందని వెల్లడించారు. దక్షిణ భారత ప్రభుత్వ రంగంలో తొలి రొబోటిక్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్‌ను నిమ్స్ చేసిందని మంత్రి దామోదర చెప్పుకొచ్చారు. 90 శాతానికి పైగా రొబోటిక్ సర్జరీలు ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ ద్వారా ఉచితమని తెలిపారు. యూరాలజీలో 590, గ్యాస్ట్రోలో 248, ఆంకాలజీలో 162 రొబోటిక్ సర్జరీలు జరుగుతాయని వివరించారు. ఎంఎన్‌జేలోనూ విజయవంతంగా రొబోటిక్ సర్జరీలు నిర్వహిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. కొత్త టిమ్స్, గాంధీ, ఉస్మానియాలో రొబోటిక్ ఆపరేషన్ థియేటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రపంచ స్థాయి వైద్య సేవలను అందుబాటులోకి తెస్తున్నామని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు.

## ఆంధ్రప్రదేశ్‌లో మూగజీవాల హింస..
# పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి రష్మీ ట్వీట్

పవన్ కల్యాణ్‌తో పాటు పోలీస్, పశుసంవర్ధక, పర్యావరణ శాఖలను ట్యాగ్ చేస్తూ ఆమె ఒక పోస్ట్ చేశారు. "పోటీల్లో పాల్గొనేందుకు ఎద్దులకు శిక్షణ ఇవ్వాలని చాలామంది చెబుతుంటారు. అయితే శిక్షణ ఇచ్చే పద్ధతి ఇదేనా? ఇందులో క్రూరత్వం మీకు కనిపించడం లేదా? అవి కూడా ప్రాణం ఉన్న జీవులే కదా?" అని రష్మీ నిలదీశారు. ఈ ఘటనకు బాధ్యులైన వారికి కౌన్సిలింగ్ ఇవ్వాలని ఆమె అధికారులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ఉద్దేశిస్తూ ఆమె మరో పోస్ట్ చేశారు. "జంతువులపై జరుగుతున్న ఈ హింసను అరికట్టడంలో మీ సహకారం త్యవసరం. అనేక సందర్భాల్లో ఇలాంటి ఘటనల వెనుక ప్రభావశీలురు ఉండటంతో మూగజీవాలకు న్యాయం జరగడం కష్టమవుతోంది. ఆలయాల్లో నందులను పూజిస్తూ, బయట వాటిపై ఇలాంటి పాశవిక చర్యలకు పాల్పడటం సరికాదు. ఇది సహాయం కోసం చేస్తున్న ఆర్తనాదం" అని ఆమె పేర్కొన్నారు. రష్మీ పంచుకున్న వీడియోలలో, గ్రామీణ ప్రాంతాల్లో కొందరు వ్యక్తులు తెల్ల ఎద్దులతో భారీ పైపులు, సిమెంట్ దిమ్మెలను లాగిస్తున్న దృశ్యాలు ఉన్నాయి. ఆ భారమైన బరువును మోయలేక ఆ మూగజీవాలు తీవ్రంగా అవస్థలు పడుతున్నట్లు వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. భారతదేశంలో జంతువుల పట్ల హింసను నిరోధించేందుకు 1960లో 'జంతు హింస' నిరోధక చట్టాన్ని రూపొందించారు.

## మిస్టర్ డ్రామారావు" అంటూ
# కేటీఆర్ పై మంత్రి పొంగులేటి ఫైర్

పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం, ఉద్యమకారుడైన పెద్ది సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వకుండా అవమానించిందని పొంగులేటి ఆరోపించారు. ఎమ్మెల్యేగా ఓటమి పాలైన తర్వాత ఆయనకు కనీసం రాజ్యసభ లేదా ఎమ్మెల్సీ పదవి అయినా ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. సంతోష్ రావు, దామోదర్ రావు వంటి వారికి పదవులు కట్టబెట్టిన బీఆర్ఎస్ నాయకత్వం, పెద్ది సుదర్శన్ రెడ్డిని ఎందుకు విస్మరించిందని ఆయన ప్రశ్నించారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ది సుదర్శన్ రెడ్డిని వైద్య చికిత్స కోసం వరంగల్ నుంచి హైదరాబాద్‌కు తరలించేందుకు గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేసిందని, ఆయన అంత్యక్రియలను అధికారిక పోలీసు లాంఛనాలతో నిర్వహించి గౌరవించిందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గుర్తుచేశారు. ఉద్యమకారులను కేవలం ఓట్ల కోసం వాడుకుని, అధికారం, కీలక పదవులన్నీ కల్వకుంట్ల కుటుంబమే అనుభవించడం బీఆర్ఎస్‌కు అలవాటుగా మారిందని ఆయన ఆరోపించారు. మరణాలను సైతం రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్న బీఆర్ఎస్ పార్టీకి రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలు మరోసారి గుణపాఠం చెప్పడం ఖాయమని పొంగులేటి ధ్వజమెత్తారు.

## రాజ్యసభ ముందుకు యాంటీ పేపర్ లీక్ బిల్లు-
# అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం

బిల్లును ప్రవేశపెట్టిన అనంతరం జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, కొత్త చట్టం ప్రకారమే నీట్ ప్రశ్నపత్రం లీక్ ఈ కేసు విచారణ జరుగుతున్నట్లు తెలిపారు. ఈ కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించినట్లు చెప్పారు. దర్యాప్తు సంస్థ ఇప్పటికే ఛార్జ్‌షీటు కూడా దాఖలు చేసినట్లు తెలిపారు. యాంటీ పేపర్ లీక్ బిల్లుపై చర్చను రాజ్యసభలో ప్రారంభించిన మంత్రి జితేంద్రసింగ్ నీట్ పేపర్ లీక్‌పై దర్యాప్తు ఐదు నెలల్లో పూర్తవుతుందని చెప్పారు. ఈ సందర్భంగా ప్రతిపక్షాలపై మంత్రి జితేంద్రసింగ్ విమర్శలు గుప్పించారు. ఆర్టికల్ 370 రద్దు, ఎన్టీఏ ఏర్పాటు ఆలస్యానికి కారణం ఎవరని ప్రతిపక్షాలను నిలదీశారు. 'ఇటీవలి కేసుకు సంబంధించి వెంటనే సీబీఐకి అప్పగించాం. మొన్న ఛార్జిషీట్ దాఖలు చేశాం. నిన్నటి నుంచి విచారణ ప్రారంభమైందని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను. ఈ కొత్త చట్టం ప్రకారం దర్యాప్తు 2 నెలల్లో పూర్తవుతుంది. ఆ తర్వాత మూడునెలల్లో విచారణ జరుగుతుంది. అంటే మొత్తం 5నెలల్లో ప్రక్రియ పూర్తవుతుంది. వారి నిబద్ధతగా ఉన్న ఆర్టికల్ 370ని రద్దు చేయడానికి 70ఏళ్లు పట్టింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని తీసుకురాకుండా అడ్డుకోవడానికి 33ఏళ్లు తీసుకున్నారు. ఇప్పుడు ఈ బిల్లును తీసుకువస్తున్న తరుణంలో వారు చేస్తున్న గగ్గోలు బిల్లుకు వ్యతిరేకం కాదు. ఇకపై ప్రమాదంలో పడబోయే వారి స్వార్థ ప్రయోజనాలకు వ్యతిరేకంగా జరుగుతున్న గగ్గోలు ఇది. 33ఏళ్లపాటు వారు చేయలేని పని ఇప్పుడు నెరవేరబోతోంది' ఖర్గే తెలిపారు.

**కుర్చీపోతుందనే భయంతోనే డిమాండ్లు అంగీకరించారు : ఖర్గే**

కుర్చీపోతుందనే భయంతోనే కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల డిమాండ్లకు అంగీకరించిందని రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే విమర్శించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఏమాత్రం లేదన్నారు. రాజ్యసభలో యాంటీ పేపర్ లీక్ చట్టసవరణ బిల్లుపై మాట్లాడిన ఖర్గే, విద్యార్థులపై పెల్లెట్ గన్ల వాడకానికి కేంద్ర హోంశాఖ మంత్రిదే బాధ్యత అని, ఇప్పుడు ఆయన దాక్కున్నారని ఎద్దేవా చేశారు. ఒకరోజు ఆయన్ను బయటకు లాగి ప్రజల ముందు నిలబెడ్తామని ఖర్గే తేల్చిచెప్పారు. "రాజ్యసభలో ప్రతిపక్ష నేత పరీక్షా వ్యవస్థలోని వైఫల్యాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా యువత తమ గళాన్ని తీవ్రంగా వినిపించారు. విద్యార్థుల ఆవేదనను ప్రతిపక్షాలు వీధుల నుంచి పార్లమెంటు వరకు ప్రతిధ్వనించేలా చేశాయి. అంతకంతకూ పెరుగుతున్న ప్రజా ఒత్తిడికి తలొగ్గి, ప్రభుత్వం మోకరిల్లాల్సి వచ్చింది. పోరాటం ఫలించి, ప్రభుత్వం మెడలు వంచేలా చేసిన దేశ యువతకు, విద్యార్థులకు నా హృదయపూర్వక అభినందనలు.

# ఆ కోల్ బ్లాక్ సింగరేణికి దక్కడం సంతోషకరం

మొదటి పేజి తరువాయి

వచ్చే విధంగా అన్నిరకాలుగా బాధ్యత వహించానని తెలిపారు. తాను కేంద్ర మంత్రిగానే కాకుండా తెలంగాణ బిడ్డగా.. సింగరేణి శ్రేయస్సు, అభివృద్ధి, సింగరేణి కార్మికులను ప్రేమించే వ్యక్తిగా ప్రత్యేక కృషి చేశానని చెప్పుకొచ్చారు.

**25 ఏళ్లపాటు ఈ మైన్ నడుస్తుంది..**

తన సహకారం ఫలితంగా సింగరేణి విజయం సాధించడం చాలా సంతోషకరమైన విషయమని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో ఇవాళ (3 ఆగస్టు, 2026) వేలం ప్రక్రియ పూర్తయిపోయిందని వెల్లడించారు. ఈ విధానంలో సింగరేణి సంస్థకు మణుగూరు ౹ఖాజ-2 డిప్‌సైడ్ బ్లాక్‌ను కేటాయిస్తున్నట్లు తెలిపారు. దక్షిణ భారతదేశంలో ఉన్న ఏకైక బొగ్గు ఉత్పత్తి సంస్థ అయిన సింగరేణి సంస్థ.. ఈ డిప్ సైడ్ బ్లాక్ వల్ల సుమారు 180 మిలియన్ టన్నుల బొగ్గు రిజర్వ్ ఉన్నాయని వెల్లడించారు. ఈ సంవత్సరానికి 6 మిలియన్ టన్నుల చొప్పున 25 ఏళ్లపాటు ఈ మైన్ నడుస్తుందని స్పష్టం చేశారు.

**2వేల మందికి ఉద్యోగాలు...**

దాదాపు 2వేల మందికి ఉద్యోగాలు వస్తాయని కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఇక్కడ దొరికే +-8 (మంచి క్వాలిటీ) బొగ్గు కారణంగా.. మొత్తం రూ.43వేల కోట్లకు పైగా రెవెన్యూ జనరేట్ అవుతుందని చెప్పుకొచ్చారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వానికి రూ.10,500 కోట్లకు మించి ఆదాయం కూడా వస్తుందని వివరించారు. తెలంగాణ ఇంధన భద్రతకు భరోసా దక్కడంతోపాటుగా.. సింగరేణి భవిష్యత్తు అభివృద్ధికి



అవసరమైన వనరులు లభిస్తాయని వెల్లడించారు. ప్రభుత్వానికి, సింగరేణికి, విద్యుత్ రంగానికి, ఉద్యోగులకు మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వానికి దాదాపుగా రూ.48వేల కోట్లకు పైగా ఆదాయం సమకూరుతుందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# కర్ణాటక కేబినెట్ విస్తరణతో కాంగ్రెస్‌లో తీవ్ర అసమ్మతి

మొదటి పేజి తరువాయి



ఢిల్లీ : కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన మంత్రివర్గ విస్తరణ

ఆ పార్టీలో తీవ్ర అసంతృప్తిని, అంతర్గత విభేదాలను రాజేసింది. మంత్రి పదవుల ఖరారులో కాంగ్రెస్ అధిష్ఠానం చివరి నిమిషంలో మార్పులు చేయడంతో, పదవులు ఆశించి భంగపడిన పలువురు ఎమ్మెల్యేలు బహిరంగంగానే తమ నిరసన వ్యక్తం చేస్తున్నారు. కొందరు రాజీనామాకు సిద్ధమవగా, మరికొందరి మద్దతుదారులు ఆందోళనలకు దిగారు. సోమవారం నాడు మొత్తం 20 మంది శాసనసభ్యులతో మంత్రివర్గాన్ని విస్తరించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. అయితే, తుది జాబితా నుంచి మంకాల్ ఎస్. వైద్య పేరును తొలగించి, ఆయన స్థానంలో సీనియర్ లింగాయత్ నేత, మాజీ మంత్రి ఎస్.ఎస్. మల్లికార్జున్‌ను చేర్చడం వివాదానికి దారితీసింది. ప్రాంతీయ, సామాజిక సమీకరణాలను సమతుల్యం చేసేందుకే ఈ మార్పు చేసినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. మంత్రి పదవి దక్కకపోవడంపై ఇండి నియోజకవర్గ ఎమ్మెల్యే యశ్వంత్ రాయగౌడ పాటిల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరి నిమిషం వరకు హామీ ఇచ్చి మోసం చేశారని, ఇది తనపై జరిగిన పెద్ద కుట్ర అని ఆయన ఆరోపించారు. స్పీకర్‌కు సమర్పించేందుకు తన రాజీనామా లేఖను కూడా సిద్ధం చేసుకున్నట్లు వెల్లడించారు. మరో ఎమ్మెల్యే, మాజీ మంత్రి బేలూరు గోపాలకృష్ణ సైతం తన శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. పార్టీకి విధేయులుగా ఉన్న వారిని విస్మరించి, రాజకీయ పలుకుబడి ఉన్న కుటుంబాలకే ప్రాధాన్యం ఇచ్చారని ఆయన విమర్శించారు. వీరితో పాటు సీనియర్ నేతలు హంపనగౌడ బదర్లి, అశోక్ పట్టణ్, రాఘవేంద్ర హిట్నాల్ వంటి వారు కూడా తీవ్ర నిరాశ వ్యక్తం చేశారు. మరోవైపు, ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన తన్వీర్ సేఠ్‌కు మంత్రి పదవి ఇవ్వలేదన్న మనస్తాపంతో ఆయన అనుచరుడు ఒకరు విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం అక్కడ నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులకు అద్దం పడుతోంది. ఈ పరిణామాల మధ్యే నేడు సాయంత్రం లోక్ భవన్ ప్రాంగణంలో కొత్త మంత్రుల ప్రమాణ స్వీకారం కార్యక్రమం జరిగింది.

# ట్రంప్ ముందు సౌదీ కీలక అభ్యర్థన.. భయపడిందా?

మొదటి పేజి తరువాయి

చూపే అవకాశం ఉందన్న ఆందోళన రియాద్‌లో వ్యక్తమవుతోంది. శనివారం ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడిన మొహమ్మద్ బిన్ సల్మాన్.. ఇరాన్‌లోని కీలక లక్ష్యాలపై అమెరికా మరిన్ని దాడులు చేపట్టే అవకాశంపై ఆందోళన వ్యక్తం చేసినట్లు సమాచారం. జోర్డాన్‌లోని అమెరికా సైనిక స్థావరంపై ఇరాన్ క్షిపణి దాడి చేయడం, హోర్ముజ్ జలసంధి గుండా ప్రయాణించే నౌకలకు అంతరాయం కలగడం వంటి పరిణామాల నేపథ్యంలో.. ఇరాన్ ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పరిశీలిస్తున్నట్లు ఆక్సియోస్ పేర్కొంది. సౌదీ అరేబియా చేపట్టిన 'విజన్ 2030' కేవలం ఆర్థిక ప్రణాళిక మాత్రమే కాదని.. దేశ ఆర్థిక వ్యవస్థను విభిన్న రంగాల్లో విస్తరించి, దీర్ఘకాలికంగా స్థిరమైన అభివృద్ధిని సాధించేందుకు రూపొందించిన సమగ్ర జాతీయ ప్రాజెక్ట్ అని రిటైర్డ్ బ్రిగేడియర్ జనరల్ అబ్దుల్లా బిన్ ఫరాహ్ అల్-షయా పేర్కొన్నారు. పెట్టుబడులు, ఇంధనం, లాజిస్టిక్స్, పర్యాటకం, ఆవిష్కరణల రంగాల్లో సౌదీ అరేబియాను ప్రపంచ కేంద్రంగా తీర్చిదిద్దడమే ఈ ప్రణాళిక ప్రధాన లక్ష్యమని తెలిపారు. అయితే ఇరాన్‌పై అమెరికా భారీ స్థాయిలో దాడులు చేపడితే గల్ఫ్ ప్రాంతం మొత్తం తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందనే ఆందోళన సౌదీ అరేబియాలో ఉంది. అమెరికా కొత్త దాడులకు దిగితే.. ఇజ్రాయెల్‌తో పాటు గల్ఫ్ దేశాల్లోని ఇంధన, కీలక మౌలిక సదుపాయాల కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని



ప్రతిస్పందించవచ్చని టెహ్రాన్ ఇప్పటికే హెచ్చరించింది. దీంతో ప్రాంతీయ భద్రతతో పాటు సౌదీ ఆర్థిక ప్రణాళికలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. పశ్చిమాసియాలో అమెరికాకు అత్యంత సన్నిహిత మిత్రదేశాల్లో సౌదీ అరేబియా ఒకటి. ఇరు దేశాల మధ్య కొన్ని అంశాల్లో విభేదాలు ఉన్నప్పటికీ.. ఇరాన్‌తో ఉద్రిక్తతలను ఎలా పరిష్కరించాలనే అంశంపై అమెరికా చర్చల్లో సౌదీ అరేబియా తన ప్రభావాన్ని కొనసాగిస్తోంది. అమెరికా మాజీ రక్షణ శాఖ అధికారి, పశ్చిమాసియా నిపుణురాలు డానా స్ట్రోల్ మాట్లాడుతూ.. యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారుల నుంచి ఎదురయ్యే ముప్పును కేవలం సైనిక చర్యలతో పూర్తిగా తొలగించలేమని సౌదీ అరేబియా గత అనుభవాల ద్వారా గుర్తించిందని తెలిపారు. అమెరికా, ఇజ్రాయెల్ పలుమార్లు సైనిక చర్యలు చేపట్టినప్పటికీ హౌతీల ముప్పును పూర్తిగా నిర్మూలించలేకపోయాయని పేర్కొన్నారు. "ఏళ్ల తరబడి యుద్ధం చేసిన తర్వాత.. యెమెన్ నుంచి హౌతీలు సృష్టిస్తున్న ముప్పును కేవలం సైనిక శక్తితో పరిష్కరించలేమని సౌదీ అరేబియా కఠిన అనుభవంతో తెలుసుకుంది. ఇది కేవలం సౌదీ సైనిక సామర్థ్యాలకు సంబంధించిన అంశం కాదు. హౌతీల ముప్పు స్వభావం, వారికి ఇరాన్ నుంచి లభిస్తున్న మద్దతు, యెమెన్‌లో వారు బలంగా పాతుకుపోయిన పరిస్థితులు కూడా కీలకమే" అని స్ట్రోల్ పేర్కొన్నారు. సౌదీ అరేబియా మరోసారి హౌతీలతో పెద్ద ఎత్తున ఘర్షణలోకి దిగితే.. 'విజన్ 2030' ప్రాజెక్టుల అమలుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని డానా స్ట్రోల్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం దేశంలో భారీ పెట్టుబడులు, పర్యాటక ప్రాజెక్టులు, కొత్త నగరాల నిర్మాణం వంటి కార్యక్రమాలకు సౌదీ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో.. ప్రాంతీయ యుద్ధం ఆర్థిక లక్ష్యాలకు అడ్డంకిగా మారవచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా.. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ.. పాకిస్థాన్, టర్కీ, సౌదీ అరేబియా అధికారులతో చర్చలు జరిపారు. అమెరికా లేదా ఇజ్రాయెల్ ఇరాన్‌పై దాడి చేసినా.. అలాంటి దాడులకు ఇతర దేశాలు మద్దతు ఇచ్చినా తీవ్ర ప్రతిస్పందన ఉంటుందని హెచ్చరించినట్లు సమాచారం. మరోవైపు ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలను తగ్గించేందుకు ఖతార్ మధ్యవర్తిత్వ ప్రయత్నాలు చేస్తోంది. హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడానికి మార్గాలను అన్వేషిస్తూ ఖతార్ అధికారులు ఇరాన్, అమెరికా ప్రతినిధులతో పాటు ఒమన్ అధికారులతో కూడా చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ప్రపంచ చమురు సరఫరాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిలో నౌకా రవాణా సాధారణ స్థితికి రావడం కోసం దౌత్యపరమైన ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

# అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్ ప్రకటించి మోసం చేశారు.. సీఎం రేవంత్‌పై కేటీఆర్ ధ్వజం

మొదటి పేజి తరువాయి

సూసైడ్ నోట్‌లో సీఎం, డిప్యూటీ సీఎం, రాహుల్‌గాంధీకి రాశారని.. ఈ లేఖను వారికి షేర్ చేయాలని ఆయన తన సూసైడ్ నోట్‌లో తెలిపారని అన్నారు. గడ్డం వేణు రాసింది సూసైడ్ నోట్ కాదని కాంగ్రెస్ పాలనపై ఛార్జ్‌షీట్ అని చెప్పుకొచ్చారు.

**యువత నిరాశ, నిస్పృహల్లో ఉన్నారు..**

వేణు రాసిన సూసైడ్ నోట్ సీఎం రేవంత్‌రెడ్డికి అందిందా...? రాష్ట్రంలో, దేశంలో యువత నిరాశ, నిస్పృహల్లో ఉన్నారని మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు. యూత్ డిక్లరేషన్ పేరుతో ఢిల్లీ నుంచి పెద్ద వాళ్లను తీసుకువచ్చి బిల్డప్పులు కొట్టారని ఎద్దేవా చేశారు. కేసీఆర్, కేటీఆర్ ఉద్యోగాలు ఊడగొడితే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని కాంగ్రెస్ నేతలు అనలేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎందుకు ఈ విషయంపై స్పందించడం లేదని నిలదీశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో రాహుల్ గాంధీ కనపడరని చెప్పుకొచ్చారు. సొంత నియోజకవర్గంలో యువకుడు సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్యాయత్నం చేసుకుంటే భట్టి ఎందుకు స్పందించరని ప్రశ్నల వర్షం కురిపించారు. 16,979 ఉద్యోగాలు ఇచ్చామని రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చెప్పిందన్నారు. తమ హయాంలో 2లక్షల 32వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చామని ప్రస్తావించారు.

**రేవంత్‌రెడ్డికి సప్లిమెంటరీలో పాస్ కావడం అలవాటు..**

ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లను పట్టుకుని సీఎం రేవంత్‌రెడ్డి క్రిమినల్ వేస్ట్ అంటే రాహుల్ గాంధీలో ఎందుకు ఎలాంటి చలనం లేదని మాజీ మంత్రి కేటీఆర్ ధ్వజమెత్తారు. ఐటీ రంగంలో ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రపంచంలో రాణిస్తున్నారని వ్యాఖ్యానించారు. 83 క్రిమినల్ కేసులు ఉన్న రేవంత్‌రెడ్డిని సీఎం చేయడం క్రిమినల్ వేస్ట్ కాదా అని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ.. రేవంత్‌రెడ్డిని నమ్మడం క్రిమినల్ వేస్ట్ అని వ్యంగ్యంగా అన్నారు. రేవంత్‌రెడ్డికి సప్లిమెంటరీలో పాస్ కావడం అలవాటని విమర్శించారు. ఎమ్మెల్యేగా ఓడిపోతే సప్లిమెంటరీలో రేవంత్‌రెడ్డి ఎంపీ అయ్యారని చెప్పుకొచ్చారు. ఆయన ఎన్నడైనా పోటీ పరీక్షలు, ఎంట్రన్స్ పరీక్షలు రాశారా...? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి సమాధి కట్టడం ఇంజినీరింగ్ విద్యార్థులకు తెలుసు అని హెచ్చరించారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి బీఆర్ఎస్ నాయకుడిని కాంగ్రెస్ సర్కార్ వేధిస్తోందని ధ్వజమెత్తారు.

**ఆ తీర్మానం నాలుక గీసుకోవడానికి కూడా పనికి రాదు..**

అసెంబ్లీ సమావేశాలు 15రోజుల పాటు నడపాలని మాజీ మంత్రి



కేటీఆర్ డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి పరిధిలో లేని వాటి గురించి మాట్లాడతారని విమర్శించారు. 21 ఏళ్లకే యువతకు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశంపై సీఎం రేవంత్‌రెడ్డి తీర్మానం నాలుక గీసుకోవడానికి కూడా పనికి రాదని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీని ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టబోమని హెచ్చరించారు. కన్నెపల్లి వద్ద నీళు కిందకు పోతున్నా లిఫ్ట్ చేయకుండా రైతుల పొలాలను ఎండబెట్టింది ఈ క్రిమినల్ వేస్ట్ ప్రభుత్వమేనని ఎద్దేవా చేశారు. వర్షాలు పడాలని మహంకాళి అమ్మవారికి మొక్కుకున్నానని తెలిపారు. ఎవరో ఏదో మాట్లాడితే పట్టించుకోవాల్సిన అవసరం లేదని మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.

# రూ.10 లక్షల వరకు కేంద్రం రుణం.. ఈ స్కీమ్‌కు ఎలా దరఖాస్తు చేయాలి?

సొంతంగా ఏదైనా వ్యాపారం ప్రారంభించాలన్నా లేదా ఉన్న వ్యాపారాన్ని మరింత విస్తరించాలన్నా పెట్టుబడి చాలా అవసరం. చిన్న వ్యాపారులు, నవ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం 'ప్రధాన్ మంత్రి ముద్ర యోజన' (గ్రవీవ్) పథకాన్ని తీసుకొచ్చింది. ఈ స్కీమ్ ద్వారా ఎలాంటి గ్యారెంటీ లేదా తనఖా లేకుండా గరిష్టంగా రూ.10 లక్షల వరకు రుణం పొందవచ్చు. భారతీయులకు ఆర్థికంగా చేయూతనిచ్చే ఈ ముద్ర లోన్ వివరాలు, ఎలా దరఖాస్తు చేసుకోవాలో ఈ పూర్తి గైడ్‌లో చూద్దాం.. ముద్ర యోజనలో 3 కేటగిరీల రుణాలు: వ్యాపార అవసరాలను బట్టి ఈ పథకం కింద 3 రకాల లోన్లు అందిస్తారు శిశు కొత్తగా వ్యాపారం మొదలుపెట్టే వారికి రూ. 50,000 వరకు రుణం ఇస్తారు. కిశోర్ వ్యాపార విస్తరణ కోసం రూ. 50,001 నుండి రూ. 5 లక్షల వరకు లోన్ పొందవచ్చు. తరుణ్‌పెద్ద మొత్తంలో వ్యాపారాన్ని అభివృద్ధి చేయడానికి రూ. 5,00,001 నుండి రూ. 10 లక్షల వరకు రుణం అందిస్తారు. రుణానికి ఎవరు అర్హులు?: మాన్యుఫ్యాక్చరింగ్, ట్రేడింగ్, సర్వీసెస్ వంటి వ్యవసాయేతర రంగాల్లో చిన్న వ్యాపారాలు చేసే భారతీయ పౌరులందరూ ఈ లోన్ కోసం అర్హులే. ఇక చిన్న దుకాణదారులు, వ్యాపారులు, తయారీదారులు మరియు కొత్తగా బిజినెస్ ఐడియాతో ముందుకు వచ్చేవారు ఈ పథకానికి అప్లై చేసుకోవచ్చు. రుణం పొందేందుకు ఎలా దరఖాస్తు చేయాలి?: బ్యాంకును సంప్రదించండి సమీపంలోని ప్రభుత్వ, ప్రైవేట్, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు లేదా స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు, సంస్థలను సంప్రదించాలి. అప్లికేషన్ ఫారమ్: బ్యాంకులో ముద్ర లోన్ దరఖాస్తు ఫారమ్‌ను తీసుకుని, మీ వ్యాపార వివరాలతో పూర్తి చేయాలి. పత్రాల సమర్పణ: గుర్తింపు కార్డు (ఆధార్, పాన్), చిరునామా ప్రమాణపత్రం,




వ్యాపార ప్రణాళిక (దీబంఱఅవం ౹ాశ్రీఖఅ) మరియు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలను జతచేయాలి. రుణ మంజూరు: మీ దరఖాస్తు మరియు వ్యాపార ప్లాన్‌ను పరిశీలించిన తర్వాత బ్యాంకర్లు రుణాన్ని ఆమోదించి, మొత్తాన్ని మీ ఖాతాలో జమ చేస్తారు. లబ్ధిదారులు తమ వంతుగా 10% మూలధనం సమకూర్చుకుంటే, మిగతా 90% అమౌంట్‌ను లోన్‌గా ఇస్తారు. ఇక ఆర్థిక ఇబ్బందుల వల్ల సొంత వ్యాపార కలను పక్కన పెట్టే వారికి ముద్ర యోజన ఒక గొప్ప అవకాశం. ఎలాంటి పూచీకత్తు లేకుండా లభించే ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని సొంత కాళ్లపై నిలబడవచ్చు. గమనిక: వడ్డీ రేట్లు, ప్రాసెసింగ్ నిబంధనలు మీరు ఎంచుకునే బ్యాంకు లేదా ఫైనాన్షియల్ సంస్థను బట్టి స్వల్పంగా మారే అవకాశం ఉంది. లోన్ అప్లై చేసేముందు సంబంధిత బ్యాంకు నిబంధనలను సరిగ్గా తెలుసుకోండి.

## రోడ్డు విస్తరణలో ఇండ్లు, షాపులను కోల్పోయిన వారికి నష్టపరిహారం చెల్లించాలి.

### బిజెపి జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్.





మంచిర్యాల, : చెన్నూరు పట్టణ బీజేపీ ప్రధాన కార్యదర్శి కాయిత వెంకటేష్ ఆధ్వర్యంలో, చెన్నూరు పట్టణంలోని పాత బస్టాండ్ నుండి రావిచెట్టు వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు, నూతన రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ తదితర అభివృద్ధి పనులను మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ పరిశీలించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చెన్నూరు నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి నియోజకవర్గంలో ఉన్నప్పటికీ ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. రోడ్డు విస్తరణ పేరుతో అనేక మంది చిన్న వ్యాపారుల షాపులను తొలగించినప్పటికీ, వారికి ఇప్పటివరకు ఎలాంటి నష్టపరిహారం అందించలేదని తెలిపారు. ఫలితంగా అనేక కుటుంబాలు తమ జీవనోపాధిని కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. అదేవిధంగా రోడ్డు, డ్రైనేజీ పనులు కూడా ఆశించిన వేగంతో ముందుకు సాగకపోవడం వల్ల ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, చెన్నూర్ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ఉండి, రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ అభివృద్ధిపై తగిన దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే రోడ్డు విస్తరణ వల్ల నష్టపోయిన బాధితులకు తగిన నష్టపరిహారం అందించి, పెండింగ్‌లో ఉన్న రోడ్లు, డ్రైనేజీ పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. చెన్నూరు పట్టణ అభివృద్ధిపై ఇకనైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డ్ సభ్యులు, బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ అండగా ఉంటుంది: వాసిరెడ్డి సీతారామయ్య



మందమర్రి,: మందమర్రి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య ముఖ్య అతిథిగా పాల్గొని జీఎం కార్యాలయ ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించారు. సింగరేణి సంస్థ ప్రస్తుతం ఎదుర్కొంటున్న పరిస్థితులను వివరిస్తూ, మణుగూరు ఓసీ బ్లాక్‌ను జెన్‌కోకు కాకుండా సింగరేణికే కేటాయించాలని ప్రభుత్వం వద్ద ఏఐటీయూసీ బలంగా డిమాండ్ చేస్తోందని తెలిపారు. ఈ వారంలో డైరెక్టర్‌తో జరగనున్న సమావేశాల్లో సానుకూల నిర్ణయం రాకపోతే ఆగస్టులో చేపట్టే సమ్మెకు ఉద్యోగులు పూర్తి సహకారం అందించాలని ఆయన పిలుపునిచ్చారు. ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ కట్టుబడి ఉందని పేర్కొన్న ఆయన, పెండింగ్‌లో ఉన్న జూనియర్ అసిస్టెంట్ పరీక్షలను త్వరగా నిర్వహించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే క్లరికల్ రిక్రూట్‌మెంట్ పూర్తై కొత్త నియామకాలు జరిగిన అనంతరం బదిలీ అయిన ఉద్యోగులను వీలైనంతవరకు తిరిగి యథాస్థానాలకు తీసుకురావడానికి ప్రయత్నిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు ఏఐటీయూసీ లో చేరారు. పర్చేజ్ విభాగానికి చెందిన సీనియర్ అసిస్టెంట్ జంగిలి అనూష, జనరల్ అసిస్టెంట్లు సిధామళ్ల రఘు, కుదిరే సువర్ణ, చిలుక దేవమ్మ, బరిగెల లక్ష్మి, ఏనుగు వినోద, భాగ్యలక్ష్మితో పాటు మరికొందరు సంఘంలో సభ్యత్వం స్వీకరించారు. కార్యక్రమంలో సెంట్రల్ సెక్రటరీ అక్బర్ అలీ, ఏరియా వైస్ ప్రెసిడెంట్ సుదర్శన్, స్ట్రక్చర్ కమిటీ సభ్యుడు సి.వి. రమణ, పిట్ సెక్రటరీ సృజన గీతిక, పిట్ కమిటీ సభ్యులు బొమ్మ శ్రీనివాస్, లక్ష్మణ్, బింగి సత్యనారాయణ, తోకల జ్యోతి, జలధి సుమలత, లక్కాకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కాగజ్‌నగర్‌లో సిపిఎం శిక్షణా తరగతులు

## మతోన్మాదంపై పిట్టల రవి విమర్శ




ఆసిఫాబాద్ : కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 2, 3 తేదీలలో పార్టీ సభ్యుల శిక్షణా తరగతులు జరిగాయి. రెండో రోజు "మతం మతోన్మాదం" అంశంపై సిపిఎం రాష్ట్ర నాయకులు పిట్టల రవి బోధించారు. బీజేపీఆర్ఎస్ఎస్ శక్తులు మతం పేరుతో మూఢనమ్మకాలను ప్రోత్సహిస్తూ రాజకీయ ఆయుధంగా వాడి ప్రజలను దోపిడీకి గురిచేస్తున్నాయని పిట్టల రవి విమర్శించారు. దీనివల్ల శాస్త్రీయ దృక్పథం బలహీనపడి, అసలు ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లుతోందని తెలిపారు. పెట్టుబడిదారీ వ్యవస్థ కార్పొరేట్ వర్గాల ప్రయోజనాల కోసమే పనిచేస్తూ కార్మికులు, రైతులు, పేదలపై ఆర్థిక భారం పెంచుతోందని పేర్కొన్నారు. మెజారిటీ, మైనారిటీ ఏ మతోన్మాదమైనా ప్రమాదకరమేనని స్పష్టం చేశారు. రాజ్యాంగం నిర్దేశించిన లౌకిక, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు ప్రజలు మతోన్మాదం, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడాలని, కార్మికరైతు ఐక్యతతో ఉద్యమాలు బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. క్లాస్ ప్రిన్సిపల్‌గా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట శ్రీనివాస్ వ్యవహరించారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, జిల్లా కార్యదర్శి కూశన రాజన్న, దుర్గం దినకర్, ముంజం ఆనంద్ కుమార్, గోడిసెల కార్తీక్, నేర్పల్లి అశోక్, బక్కన్న, జె రాజేందర్, గెడం టీకానంద్, రాజ్ కుమార్, కృష్ణమాచారి, జాడి మల్లయ్య, పద్మ, కమల తదితరులు పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ విద్యార్థులను క్రిమినల్ వేస్ట్ అన్న సీఎం రేవంత్ రెడ్డియే అసలు క్రిమినల్ వేస్టేజ్

### సిర్పూర్ శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబు



ఆసిఫాబాద్ : హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సిర్పూర్ శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబు పత్రికా విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులను క్రిమినల్ వేస్ట్‌గా సంబోధించిన సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రానికి క్రిమినల్ వేస్టేజ్‌గా మిగిలారని హరీష్ బాబు విమర్శించారు. విద్యా, పురపాలక, హోం శాఖలు మూడూ అధోగతి పాలవడంతో అసహనంతో ఇలాంటి ప్రేలాపనలు చేస్తున్నారని తెలిపారు. ప్రైవేటు ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లను క్రిమినల్ వేస్ట్‌తో పోల్చిన సీఎం, ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీల అభివృద్ధికి ఏం చేశారని ప్రశ్నించారు. బోధనా, బోధనేతర సిబ్బందిని నియమించకుండా ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీలను నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. విద్యార్థులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు సోలంకి శ్రీనివాస్, అభిషేక్ జగిని, పవన్ పాల్గొన్నారు.

## డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీకి

## ఆదివాసీ నాయకుల సన్మానం



ఆసిఫాబాద్ : కుమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీని ఆదివాసీ నాయకులు కలిసి శాలువాతో సత్కరించారు. మాజీ గ్రంథాలయ చైర్మన్ కనక యాదవ్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ భేటీలో గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం, విద్య, ఉపాధి, మౌలిక వసతుల సమస్యలపై చర్చించారు. ఆదివాసీ ప్రాంతాల్లోని సమస్యలను నాయకులు డిప్యూటీ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, పరిష్కారానికి కృషి చేస్తానని జాదవ్ అంబాజీ హామీ ఇచ్చారు. గిరిజన సంక్షేమ పథకాలు ప్రజలకు సమర్థవంతంగా అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆదివాసీ నాయకులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

## చలో ఢిల్లీ ఎస్టీ హోదా కోసం మాలి కులస్తుల ఉద్యమం



ఆసిఫాబాద్ : కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నియోజకవర్గంలో తెలంగాణ మాలి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లేండుగురే శ్యాంరావు, ప్రధాన కార్యదర్శి వసంతరావు ఆధ్వర్యంలో వరుస సమావేశాలు జరుగుతున్నాయి. బెజ్జూర్, చింతలమానేపల్లి, కౌటాల, సిర్పూర్ తదితర మండలాల్లో మాలి సంఘం నాయకులతో ఈ భేటీలు కొనసాగుతున్నాయి. మాలి కులస్తులకు ఎస్టీ హోదా సాధన కోసం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన, ధర్నా కార్యక్రమాలు చేపట్టనున్నారు. వీటిని విజయవంతం చేసేందుకు అనుసరించాల్సిన కార్యాచరణపై సమావేశాల్లో చర్చిస్తున్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులు వివిధ జిల్లాల మండలాలు, గ్రామాల నుంచి సంఘం ప్రతినిధులను కలుస్తూ ఉద్యమాన్ని బలోపేతం చేస్తున్నారు. ప్రతి జిల్లా నుంచి అధిక సంఖ్యలో సభ్యులు ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొనేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు లేండుగురే శ్యాంరావు తెలిపారు. సమావేశాలకు మాలి సంఘం రాష్ట్ర నాయకులు, వివిధ మండలాల అధ్యక్షులు, మాలి కులస్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు.

## సరండిలో నిరుపయోగంగా డంపింగ్ యార్డు

### వృథాగా లక్షల ప్రజాధనం



ఆసిఫాబాద్ : కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం సరండి గ్రామపంచాయతీలో లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన డంపింగ్ యార్డు వినియోగానికి నోచుకోకుండా నిరుపయోగంగా మారింది. యార్డుకు వెళ్లే మార్గంలో కెనాల్ కాలువ అడ్డుగా ఉండి, వంతెన లేదా కల్వర్టు లేకపోవడంతో చెత్త సేకరణ వాహనాలు అక్కడికి చేరుకోలేకపోతున్నాయి. నిర్మాణం పూర్తయి చాలాకాలమైనా ఇప్పటివరకు ఒక్క ట్రాక్టర్ చెత్త కూడా అక్కడ వేయలేదని గ్రామస్థులు తెలిపారు. దీంతో గ్రామంలోని రహదారుల పక్కన, ఖాళీ స్థలాల్లో చెత్తను తాత్కాలికంగా వేయాల్సి వస్తోంది. వర్షాకాలంలో ఈ చెత్త మురుగు కాలువలను మూసుకుపోయేలా చేస్తూ, మురుగు నీరు రోడ్లపైకి చేరుతోంది. దోమలు, ఈగలు పెరిగి డెంగీ, మలేరియా, వైరల్ జ్వరాల ముప్పు పొంచి ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికులు సైతం చెత్త వేసేందుకు స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు. నిర్మాణానికి ముందు మార్గం, కాలువ అడ్డంకి వంటి ప్రాథమిక అంశాలు పరిశీలించకపోవడం వల్లే ప్రజాధనం వృథా అయిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం యార్డు పిచ్చిమొక్కలతో నిండిపోయింది. కెనాల్‌పై వంతెన లేదా కల్వర్టు నిర్మించి శాశ్వత రహదారి ఏర్పాటు చేయాలని, అవసరమైతే ప్రత్యేక నిధులు మంజూరు చేసి యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని జిల్లా, మండల అధికారులను గ్రామస్థులు కోరుతున్నారు.


## అడవి పంది దాడిలో చిన్నారికి తీవ్ర గాయాలు





మంచిర్యాల, : భీమారం మండలం కాజీపల్లి గ్రామంలో గోదారి పురుషోత్తం కుమార్తె స్ఫూర్తి రాణి(4)పై అడవి పంది దాడి చేసింది. ఉదయం ఇంటి వద్ద ఆడుకుంటుండగా అడవి పంది దాడి చేయడంతో తలకు తీవ్ర గాయాలైన చిన్నారిని 108లో మంచిర్యాలకు తరలించారు. తర్వాత పరిస్థితి విషమించడంతో కరీంనగర్ హాస్పిటల్ కు తరలించారు. నిరుపేద కుటుంబానికి చెందిన చిన్నారి ని ఆదుకోవాలని సర్పంచ్, గ్రామస్తులు కోరుతున్నారు

## జైపూర్ ఇన్చార్జ్ ఎంపీడీవో కు సన్మానం.



మంచిర్యాల,: జైపూర్ మండలం ఇంచార్జ్ ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీవో శ్రీపతి బాపూరావు ను ఎంపీపీ కార్యాలయంలో పలువురు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో వనజ రెడ్డి , ఇందారం సర్పంచ్ మహమ్మద్ ఫయాజ్, శ్రీపతి బాపూరావు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మంచిర్యాల జిల్లా ఇన్చార్జి డిపిఓగా డిఆర్డిఓ కిషన్.



మంచిర్యాల, : మంచిర్యాల జిల్లా ఇన్చార్జి జిల్లా పంచాయతీ అధికారిగా (డీపీవో ) బాధ్యతలు స్వీకరించిన డి ఆర్ డి ఓ కిషన్, ని జిల్లా పంచాయతీ కార్యాలయంలో మంచిర్యాల, బెల్లంపల్లి డిఎల్పిఓ లు , వివిధ మండలాల మండల పంచాయతీ అధికారులు మరియు కార్యాలయ సిబ్బంది శాలువాతో సత్కరించి, పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గౌరవ డివిజనల్ పంచాయతీ అధికారులు డి.ధర్మారాణి , కే.సతీష్ , మండల పంచాయతీ అధికారులు శ్రీపతి బాపు రావు , అజ్మత్ అలీ , సఫ్దర్ అలీ, ఏ సుమన్ , డీపీవో కార్యాలయ సీనియర్ సహాయకులు ప్రజ్ఞ తదితరులు పాల్గొన్నారు.


## చెరువులో పడి వ్యక్తి మృతి



లక్షెట్టిపేట, : లక్షెట్టిపేట పట్టణంలోని తిలక్ నగర్ కు చెందిన రాపల్లి రమేష్ అనే 45 సంవత్సరాల వ్యక్తి చెరువు నీటిలో పడి మృతి చెందాడు. మృతునికి చేపలు పట్టే అలవాటు ఉంది. మృతుడు ఆదివారం సాయంత్రం మహాలక్ష్మి వాడలోని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి రాత్రి వరకు ఇంటికి రాలేదు. సోమవారం ఉదయం చెరువులో మృతదేహం కనిపించగా సమాచారం అందుకున్న కుటుంబీకులు చెరువు వద్దకు వెళ్లి చూడగా చెరువు నీటిలో చనిపోయి ఉన్నాడు. మృతుడు చేపలను పట్టడం కోసం చెరువు నీటిలో వలవేయగా అట్టి వల ఆయన కాలుకు చేతుకు చిక్కుకొని అదే చెరువులో పడి మృతి చెందాడు. మృతుని తల్లి బుచ్చి రాజవ్వ ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ అన్వర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నరు

## ఎర్ర చెరువు భూమిని కాపాడాలి.

### సమగ్ర విచారణకు బచ్చలి ప్రవీణ్ కుమార్ డిమాండ్




మందమర్రి, : మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం ఆదిల్‌పేట్ పరిధిలోని ఎర్ర చెరువు భూములను పరిరక్షించి,చెరువును అభివృద్ధి చేయడం ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని నాయకుడు బచ్చలి ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం మందమర్రి మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ప్రభుత్వం ఎర్ర చెరువు నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు, వర్షాకాలంలో నీటిని సమర్థవంతంగా నిల్వ చేసేందుకు చెరువు పరిసర ప్రాంతాల్లోని 30 ఎకరాలకు పైగా పట్టా భూమిని రైతుల నుంచి కొనుగోలు చేసింది.

**మళ్లీ ఇతరుల ఆధీనంలోకి భూమి?:**

ప్రజాధనంతో ప్రభుత్వం సేకరించిన ఈ 30 ఎకరాల భూమి ప్రస్తుతం మళ్లీ ప్రైవేటు వ్యక్తులు/ఇతరుల ఆధీనంలోకి వెళ్లినట్లు సమాచారం ఉందని ప్రవీణ్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. అసలు ప్రభుత్వ భూమి ఇతరుల చేతుల్లోకి ఎలా వెళ్లిందో తెలుసుకునేందుకు సమగ్ర విచారణ జరపాలని కోరారు. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు వెంటనే స్పందించి సంయుక్తంగా సర్వే నిర్వహించాలని, ఆక్రమణలు ఉంటే తక్షణమే తొలగించి పూర్తి వివరాలను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. "ప్రభుత్వం కొనుగోలు చేసిన భూమిని పూర్తి స్థాయిలో స్వాధీనం చేసుకుని, చెరువును ఆధునిక పద్ధతుల్లో అభివృద్ధి చేయాలి. దీని ద్వారా దిగువన ఉన్న వందలాది ఎకరాల వ్యవసాయ భూములకు, చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలాని. రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఎర్ర చెరువు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఇందిరమ్మ ఇండ్ల పథకం 2వ విడత

**లబ్ధిదారుల పరిశీలన వేగవంతం చేయాలి**

**కలెక్టర్ కె.హరిత**



ఆసిఫాబాద్ : కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సోమవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కె.హరిత, ఇందిరమ్మ ఇండ్ల పథకం 2వ విడతలో గృహ నిర్మాణ పనులు, లబ్ధిదారుల డెస్క్ పరిశీలన, ఫీల్డ్ పరిశీలన ప్రక్రియలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, గ్రామీణ అభివృద్ధి సంస్థ జిల్లా ప్రాజెక్టు అధికారి ప్రకాష్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వేణు పాల్గొన్నారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో 10లోపు, కెరమెరి మండలంలో 13 దరఖాస్తులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నందున మంగళవారంలోగా డెస్క్ పరిశీలన పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. సిర్పూర్-టి, కౌటాల, బెజ్జూర్, పెంచికల్‌పేట్, వాంకిడి, లింగాపూర్, రెబ్బెన మండలాల్లో 100లోపు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నందున శనివారం సాయంత్రంలోగా పరిశీలన పూర్తి చేయాలని ఆదేశించారు. జాబితాలో లేని అర్హులైన హట్ డ్వెల్లర్స్ ఎవరైనా ఉంటే, వారి వివరాలను క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా సేకరించి ఫోటోలతో సహా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఎల్-1, ఎల్-2, ఎల్-3 జాబితాల్లోని లబ్ధిదారుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి కేటాయించిన 500 రూఫ్ రీప్లేస్‌మెంట్ ఇళ్ల పనులను వేగవంతం చేసి, గోడలు బాగుండి పైకప్పు మార్పిడి అవసరమైన ఇళ్లకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జిల్లాలో ప్రస్తుతం ఆర్‌సీ లెవల్‌లో ఉన్న 2,712 గృహాల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని, జైనూర్ మండలంలో 369 ఇళ్లతో పాటు కాగజ్‌నగర్, కెరమెరి ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో నిర్మాణాలు జరుగుతున్నందున ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. బిల్లుల చెల్లింపులో సందేహాలు అవసరం లేదని, ప్రభుత్వం నుంచి నిధులు సకాలంలో విడుదలవుతాయని గుత్తేదారులు, లబ్ధిదారులకు అవగాహన కల్పించి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ కోరారు. డెస్క్, క్షేత్రస్థాయి పరిశీలనలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, తప్పుడు వివరాలకు అవకాశం లేకుండా ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.

## గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులకు ఐదు రోజుల శిక్షణ ప్రారంభం

**డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ**

**ఏసీఎంఓ పి. ఉద్ధవ్**

ఆసిఫాబాద్ : ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సోమవారం గణిత, ఫిజికల్ సైన్స్, సోషల్ స్టడీస్ ఉపాధ్యాయుల కోసం ఐదు రోజుల కెపాసిటీ బిల్డింగ్ & ఇంటిగ్రేటెడ్ టీచర్ ట్రైనింగ్ కార్యక్రమం ప్రారంభమైంది. ఐటిడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఆదేశాల మేరకు రెండో విడతగా ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో బోధిస్తున్న ఉపాధ్యాయుల కోసం ఈ శిక్షణ నిర్వహిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ, ఏసీఎంఓ పి. ఉద్ధవ్ తెలిపారు. సబ్జెక్టు నిపుణులు, డీఆర్పీల ద్వారా బోధనా నైపుణ్యాల మెరుగుదల, సామర్థ్యాధారిత బోధన, అభ్యసన ఫలితాల సాధన, వినూత్న బోధనా పద్ధతులు, తరగతి గది నిర్వహణ, మూల్యాంకన విధానాలు, విద్యార్థి-కేంద్రీకృత బోధన అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ అందిస్తున్నారు. ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని చురుకుగా పాల్గొని బోధనా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని జాదవ్ అంబాజీ, పి. ఉద్ధవ్ సూచించారు. ఈ శిక్షణ ఆగస్టు 7వ తేదీ వరకు కొనసాగుతుంది.

# ప్రభుత్వ భూమిలో అక్రమ బాట..!

- సర్వే నం.281లో వెంచర్ కోసం 30 అడుగుల రహదారి ఏర్పాటు ఆరోపణలు
- ఫిర్యాదులు పట్టించుకోని అధికారులు అంటూ రాజపేట తండా గ్రామ ప్రజల ఆవేదన..
- "ప్రభుత్వ భూమిని కాపాడాలి.. అక్రమ మార్గాన్ని తొలగించాలి"
- రాజపేటతండా గ్రామస్తుల డిమాండ్



మర్రిగూడ/నేటి దిక్సూచి : ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన రెవెన్యూ శాఖ నిర్లక్ష్యంతోనే ఆక్రమణలకు ఆస్కారం కలుగుతోందా..? అనే ప్రశ్నలు మర్రిగూడ మండలంలో వినిపిస్తున్నాయి. రాజుపేట తండా గ్రామ పరిధిలో ని ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 281లో ప్రైవేట్ వెంచర్‌కు దారి కల్పించేందుకు ప్రభుత్వ భూమిలోనే అక్రమంగా రహదారి ఏర్పాటు చేస్తున్నారని ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు కొండల ముదిరాజ్ వినతిపత్రం అందజేశారు. సర్వే నంబర్ 281లో సుమారు 10 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, అందులో కొంత భాగంలో తహశీల్దార్ కార్యాలయం, ప్రభుత్వ పాఠశాలలు నిర్మించినట్లు తెలిపారు. గతంలో ఇదే భూమిలో పేదలకు ఇంటి స్థల పట్టాలు కూడా మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం ఆ ప్రభుత్వ భూమి పక్కనే ఏర్పాటు చేస్తున్న ప్రైవేట్ వెంచర్‌కు రహదారి సౌకర్యం లేకపోవడంతో ప్రభుత్వ భూమి నుంచే సుమారు 30 అడుగుల వెడల్పుతో బాట ఏర్పాటు చేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంతో సుమారు ఒక ఎకరం మేర ప్రభుత్వ భూమి దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ఫిర్యాదులు ఫైళ్లకే పరిమితమా..?

ప్రభుత్వ భూమి పరిరక్షణపై బాధ్యత వహించాల్సిన తహశీల్దార్ కార్యాలయానికి పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు క్షేత్రస్థాయి పరిశీలన, విచారణ, చర్యలు కనిపించలేదని గ్రామస్తులు వాపోతున్నారు. "ప్రభుత్వ భూమి కళ్ల ముందే వినియోగంలోకి వెళ్తుంటే అధికారులు ఎందుకు స్పందించడం లేదు? ఫిర్యాదులపై చర్యలు తీసుకోవడంలో ఆలస్యం వెనుక కారణం ఏమిటి?" అంటూ గ్రామ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రాజకీయ పలుకుబడి ఉన్న వ్యక్తుల ఒత్తిళ్లతోనే అధికారులు మౌనం వహిస్తున్నారనే అనుమానాలు గ్రామంలో వ్యక్తమవుతున్నాయని తెలిపారు.

### కలెక్టర్ దృష్టికి గ్రామస్తుల వినతి

సర్వే నంబర్ 281లో జరుగుతున్నట్లు ఆరోపిస్తున్న అక్రమ రహదారి నిర్మాణం, వెంచర్ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి ప్రభుత్వ భూమిని రక్షించాలని రాజపేటతండా గ్రామ ప్రజలు జిల్లా కలెక్టర్‌ను కోరుతున్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అధికారులు తక్షణమే స్పందించి, నిబంధనలకు విరుద్ధంగా జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## తల్లిపాలే బిడ్డకు తొలి శ్రీరామరక్ష

## రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి



నేటి దిక్సూచి, రంగారెడ్డి: నవజాత శిశువుకు తల్లిపాలు ప్రకృతి ప్రసాదించిన అమృతంతో సమానమని, పుట్టిన తొలి గంటలోనే బిడ్డకు పాలు పట్టడం ప్రతి తల్లి ప్రాథమిక బాధ్యతని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి తెలిపారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను (ఆగస్టు 1 నుండి 7 వరకు) పురస్కరించుకొని సోమవారం కలెక్టరేట్‌లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ రూపొందించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బిడ్డ జన్మించిన మొదటి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలు మాత్రమే అందించాలని, ఆ తర్వాత తగిన పౌష్టికాహారంతో పాటు రెండేళ్ల వరకు పాలను కొనసాగించాలని సూచించారు. తల్లిపాలు శిశువుకు సహజసిద్ధమైన వ్యాధినిరోధక టీకాగా పనిచేసి పలు రుగ్మతల నుండి రక్షిస్తాయని, అదే సమయంలో తల్లి ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తాయని పేర్కొన్నారు. "తల్లిపాలకు ప్రాధాన్యత ఇద్దాం సుస్థిరమైన సహాయ వ్యవస్థలను ఏర్పాటు చేద్దాం" అనే ఈ ఏడాది థీమ్‌ను పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ, బిడ్డకు పాలు పట్టే విషయంలో కుటుంబం, సమాజం మరియు ప్రభుత్వాలు ఉమ్మడిగా మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉందని అన్నారు. జిల్లా సంక్షేమ అధికారి శాంతి శ్రీ మాట్లాడుతూ, వారం రోజుల పాటు జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ర్యాలీలు, సదస్సులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ స్వర్ణలత, అడ్మినిస్ట్రేషన్ అధికారి సునీల్, సీడీపీఓలు, సంక్షేమ శాఖ సిబ్బంది ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఫుడ్ సేఫ్టీ అధికారుల పేరిట దగా.. వ్యాపారులు జాగ్రత్త!

## జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి మనోజ్ కుమార్

నేటి దిక్సూచి, రంగారెడ్డి: ఫుడ్ సేఫ్టీ అధికారులమంటూ వ్యాపారులను బురిడీ కొట్టిస్తున్న ముఠాల పట్ల అప్రమత్తంగా ఉండాలని రంగారెడ్డి జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి మనోజ్ కుమార్ సూచించారు. "లైసెన్సులు ఇప్పిస్తాం.. శిక్షణ ధృవీకరణ పత్రాలు ఇస్తాం" అంటూ వ్యాపారుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న వారి మాటలు నమ్మి మోసపోవద్దని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఆహార తనిఖీలు తీవ్రతరం చేసిన క్రమంలో, కొందరు అపరిచిత వ్యక్తులు ఫుడ్ సేఫ్టీ శాఖ అధికారుల పేర్లను వాడుకుంటూ వ్యాపారులను భయభ్రాంతులకు గురిచేసి నకిలీ లైసెన్సులు, రిజిస్ట్రేషన్ల పేరుతో దందాకు దిగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇలాంటి ఫేక్ కాల్స్ లేదా దళారుల మాటలు నమ్మి రూపాయి కూడా చెల్లించవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. అధికారిక సేవలు, లైసెన్సులు, శిక్షణకు సంబంధించిన ఏవైనా సందేహాలుంటే నేరుగా ఫుడ్ సేఫ్టీ కార్యాలయాన్నే సంప్రదించాలని, ప్రక్రియ అంతా నిబంధనల ప్రకారం పారదర్శకంగా జరుగుతుందని వెల్లడించారు. ఎవరైనా అధికారుల పేరు చెప్పి డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే తమ శాఖకు గానీ, పోలీసులకు గానీ ఫిర్యాదు చేయాలని సూచించారు. పెరుగుతున్న సైబర్ నేరాల దృష్ట్యా ప్రతి ఒక్కరూ అప్రమత్తత పాటించాలని కోరారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

## కలెక్టర్ సి. నారాయణ రెడ్డి



నేటి దిక్సూచి, రంగారెడ్డి:ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన



బాధితుల నుంచి కలెక్టర్ స్వయంగా అర్జీలు స్వీకరించారు. మొత్తం 102 ఫిర్యాదులు రాగా, అందులో భూ సంబంధిత రెవెన్యూ విభాగానికి 33, మిగతా శాఖలకు సంబంధించి 69 అర్జీలు దాఖలయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అధికారులు ప్రజా సమస్యలపై ప్రత్యేకాధికారం, శ్రద్ధ వహించాలని, కాలయాపన చేయకుండా త్వరితగతిన పరిష్కారం చూపాలని కోరారు. ప్రజావాణి వినతుల పురోగతిపై నిరంతరం సమీక్ష ఉంటుందని, ప్రజలకు పరిపాలనపై నమ్మకం కలిగేలా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, కిరణ్మయి, డిఆర్ఓ శారదతో పాటు పలు శాఖల ముఖ్య అధికారులు హాజరయ్యారు.

## తల్లిపాలే పాపాయికి శ్రీరామరక్ష: సహాయ

## పురపాలక సహాయక అధికారి బి.ఎన్.కె. రమేష్






నేటి దిక్సూచి, ఆదిభట్ల: పాపాయి ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లిపాలే అమృతంతో సమానమని ఆదిభట్ల సర్కిల్ పురపాలక సహాయక అధికారి బి.ఎన్.కె. రమేష్ తెలిపారు. ప్రతి బాలింత తన బిడ్డకు పాలు అందించేలా కుటుంబ సభ్యులు పూర్తి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఆదిభట్ల సర్కిల్-15 పరిధిలో సమగ్ర బాలల అభివృద్ధి సేవల విభాగం, పురపాలక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో బాలింతలు, గర్భిణులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... బిడ్డ జన్మించిన వెంటనే పట్టే పాలు శరీరానికి కావలసిన సంపూర్ణ పోషకాలను అందించి, వ్యాధుల నుండి కాపాడే శక్తిని ఇస్తాయని చెప్పారు. మొదటి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టాలని, దీనిపై ఉన్న అపోహలను తొలగించి ప్రతి తల్లికి సరైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

## ప్లాస్టిక్ కరెన్సీ వచ్చాక పేపర్ నోట్లు బ్యాన్..!

## కేంద్రం నుంచి బిగ్ అనౌన్స్‌మెంట్ అసలు

ప్లాస్టిక్ కరెన్సీ నోట్లపై కేంద్రం నుంచి మరో అప్డేట్ వచ్చింది. ఆర్బీఐ త్వరలో ప్లాస్టిక్ నోట్లను ప్రవేశపెట్టేందుకు రెడీ అవుతోంది. అయితే ఇవి అందుబాటులోకి వచ్చాక పేపర్ కరెన్సీ ఏమవుతుందనే ప్రశ్నలు చాలామందిలో వస్తున్నాయి. వీటిని రద్దు చేస్తారా అనే వార్తలు వస్తున్నాయి. ప్లాస్టిక్ కరెన్సీ నోట్లను త్వరలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. గతకొద్ది రోజుల క్రితం ఆర్బీఐ ప్రతిపాదనకు కేంద్రం ఆమోదం తెలిపింది. దీంతో పాలిమర్‌తో కూడిన ప్లాస్టిక్ నోట్లను త్వరలో ప్రవేశపెట్టేందుకు ఆర్బీఐ సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు ఇప్పటికే పాలిమర్ షీట్ల కోసం అంతర్జాతీయ కంపెనీల నుంచి ఆర్బీఐ టెండర్లను ఆహ్వానిస్తోంది. టెండర్లు ఖరారు అయిన తర్వాత ప్లాస్టిక్ నోట్ల ప్రింటింగ్ మొదలుకానుందని తెలుస్తోంది. కొన్ని సంవత్సరాల క్రితం ఆర్బీఐ ఈ ప్రాజెక్టును చేపట్టగా.. ఏటీఎంలలో సాంకేతిక కారణాల వల్ల నిలిపివేసింది. ఇప్పుడు మరోసారి పైలట్ ప్రాజెక్టుగా ప్లాస్టిక్ నోట్లను తీసుకొచ్చే ప్రయత్నాలు మొదలుపెట్టింది.

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి: కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షురాలు కొత్త కురుమ మంగమ్మ శివకుమార్



రంగారెడ్డి జిల్లా (నేటి దిక్సూచి): ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలు కొత్త కురుమ మంగమ్మ శివకుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి పారదర్శకమైన ఓటరు జాబితా ఎంతో అవసరమని ఆమె స్పష్టం చేశారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు, మహిళలు తప్పనిసరిగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని, అలాగే ఓటరు జాబితాలో తప్పులు ఉంటే సరిచేసుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ సవరణ ప్రక్రియలో భాగంగా బూత్ స్థాయి అధికారులు (0అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ వివరాలను పరిశీలించుకుని అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఓటు ఎంతో విలువైనదని, సరైన రీతిలో ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని మరింత బలపరచవచ్చని అన్నారు. ఎన్నికల అధికారులు, ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమానికి ప్రజలందరూ సహకరించాలని కొత్త కురుమ మంగమ్మ శివకుమార్ విజ్ఞప్తి చేశారు.

## కరవు తొలగాలని వరుణుడికి వేడుకలు...

## భీమ్లా తండాలో భక్తి, సంప్రదాయాల సందడి"



మర్రిగూడ/ **(దిక్సూచి ప్రతినిధి):** మర్రిగూడ మండలం కమ్మగూడ గ్రామపంచాయతీ పరిధిలోని భీమ్లా తండాలో బోనాల పండుగను గిరిజనులు ఆధ్యాత్మిక ఉత్సాహంతో ఘనంగా నిర్వహించారు. సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ తండా ప్రజలు బొడ్రాయికి పవిత్ర జలాలతో అభిషేకాలు నిర్వహించి, ఏడుగురు గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాంప్రదాయ దుస్తుల్లో మహిళలు బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా దేవాలయానికి చేరుకోవడం, యువకులు సంప్రదాయ త్యాలతో సందడి చేయడం పండుగకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



భక్తి గీతాలు, డప్పు వాయిద్యాల నడుమ తండా అంతా పండుగ వాతావరణంతో కళకళలాడింది. ఎల్‌నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో, వరుణ దేవుడు కరుణించి సమృద్ధిగా వర్షాలు కురిపించాలని గ్రామస్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పంటలు బాగా పండాలని, పశుసంపద వృద్ధి చెందాలని, గ్రామంలో సుఖశాంతులు, సుభిక్షం నెలకొనాలని గ్రామదేవతలను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో కమ్మగూడ సర్పంచ్ విజయ్ లక్ష్మణ్ నాయక్, మాజీ ఎంపీటీసీ ఆంబోత్ కిషన్ నాయక్, వార్డు సభ్యులు రామావత్ విజయ్, రామావత్ బిక్షం, మాజీ వార్డు సభ్యులు శ్రీను, రామావత్ రమేష్, రామావత్ సురేందర్, రామావత్ నాగరాజు, రామావత్ గణేష్, రామావత్ రెడ్డి, వడ్త్యా నవీన్, ఆంబోత్ విజయ్, రామావత్ రాజు, రామావత్ నరేష్, నరేందర్, అశోక్, సునీల్, శ్రీధర్, రాంచరణ్, మహేష్, కిట్టు, సోను, వంశీతో పాటు తండా పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## ఖుదాబక్షపల్లి భూమి వివాదానికి తెరపడనున్నదా..?

### క్షేత్రస్థాయిలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ విచారణ

### వి.ఓ. భవన నిర్మాణానికి భద్రత కల్పించాలని పోలీసులకు ఆదేశాలు



మర్రిగూడ/ **(దిక్సూచి ప్రతినిధి):** మర్రిగూడ మండలం ఖుదాబక్షపల్లి గ్రామంలో గ్రామకంఠం భూమికి సంబంధించిన వివాదం కొత్త మలుపు తిరిగింది. జిల్లా ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ ఎన్. శ్రీకాంత్ సోమవారం స్వయంగా గ్రామాన్ని సందర్శించి వివాదాస్పద స్థలాన్ని పరిశీలించారు. జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ చక్రవర్తితో కలిసి సంబంధిత రెవెన్యూ రికార్డులు, గ్రామపంచాయతీ పత్రాలు, స్థల వివరాలను పరిశీలిస్తూ క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టారు. గ్రామకంఠం భూమిలో ప్రతిపాదిత విలేజ్ ఆర్గనైజేషన్ (వి.ఓ.) భవన నిర్మాణానికి సంబంధించిన స్థల ధృవీకరణ పత్రం ఫోర్జరీ జరిగిందన్న ఆరోపణల నేపథ్యంలో అధికారులు అన్ని కోణాల్లో విచారణ కొనసాగించారు. ప్రాథమిక పరిశీలనలో వివాదాస్పద స్థలం గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామకంఠం భూమిగా గుర్తింపు పొందినట్లు అధికారులు వెల్లడించినట్టు సమాచారం. వి.ఓ. భవన నిర్మాణ పనులు ఎలాంటి అవాంతరాలు లేకుండా కొనసాగేందుకు తగిన పోలీసు భద్రత కల్పించాలని మర్రిగూడ ఎస్ఐ రాంబాబుకు ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మర్రిగూడ తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, ఎంపీడీవో జి.సి. మున్నయ్య, ఎంపీఓ రవికుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వ రికార్డులు, రెవెన్యూ ఆధారాలు, క్షేత్రస్థాయి పరిశీలన ఆధారంగా వాస్తవాలను నిర్ధారించే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. తుది నివేదిక అనంతరం ప్రభుత్వ నిబంధనల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ పరిశీలనలో సర్పంచ్ పందుల విజయలక్ష్మి, పాండు గౌడ్, పంచాయతీ కార్యదర్శి ప్రసన్నబాబు, ఉపసర్పంచ్ ఎస్కే షబీర్, ప్రజాప్రతినిధులు,పాల్గొన్నారు.


## యూపీఐ వాడుతున్నారా..?త్వరలోనే పెద్ద మార్పు

## డబ్బులు పంపాలంటే ఇది తప్పనిసరిగా చేయాల్సిందే

యూపీఐ ఎక్కువగా వాడుతున్నారా.. అయితే త్వరలో ఒక పెద్ద మార్పు అమల్లోకి వచ్చే అవకాశముంది. టీ షాప్ దగ్గర చేసే చిన్న లావాదేవీలకు కూడా చాలామంది యూపీఐ ఉపయోగిస్తున్నారు. ఇక పెద్ద లావాదేవీలు సులువగా ఈ విధానం ద్వారా చేయవచ్చు. అయితే.. స్మార్ట్‌ఫోన్ కలిగి ఉన్న ప్రతీఒక్కరూ ఏదోక యూపీఐ యాప్ వాడుతుంటారు. యూపీఐ లావాదేవీలు రోజురోజుకు రికార్డ్ సృష్టిస్తున్నాయి. ప్రతీరోజూ బిలియన్ల రూపాయల యూపీఐ ట్రాన్సాక్షన్లు జరుగుతున్నాయి. దీంతో పాటు యూపీఐ ద్వారా జరిగే మోసాలు కూడా పెరిగిపోతున్నాయి. ఈ సైబర్ మోసాలను అరికట్టేందుకు ఆర్బీఐ, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు బ్యాంకులు కొత్త ప్రతిపాదన చేశాయి. అనుమానాస్పద లేదా అధిక రిస్క్‌తో కూడుకున్న యూపీఐ లావాదేవీలు చేసేముందు పలు సేఫ్టీ ఫీచర్లను పాటించాలని బ్యాంకులు సూచించాయి. ఇలాంటి లావాదేవీలు చేసేముందు వినియోగదారులను అలర్ట్ చేసేలా కొత్త విధానాన్ని ప్రతిపాదించాయి. ఈ కొత్త విధానం ఏంటి..? ఎలా పనిచేస్తుంది? అనే విషయాలు ఇప్పుడు చూద్దాం.

లావాదేవీ చేసేముందు అలర్ట్ మెస్సేజ్..

యూపీఐ ద్వారా జరిగే సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు ఆర్బీఐకు బ్యాంకుల కీలక ప్రతిపాదనలు చేశాయి. అనుమానాస్పద, హైరిస్క్ కలిగిన లావాదేవీలు చేసేముందు స్క్రీన్‌పై అవును లేదా కాదు అనే పాప్ అప్ ప్రదర్శించేలా చర్యలు చేపట్టాలని ఎన్‌పీసీఐ, ఆర్బీఐకు బ్యాంకులు సూచించాయి. అవునుపై ప్రెస్ చేస్తే లావాదేవీలు వెంటనే ప్రాసెస్ అవుతుంది. కాదు అని చెబితే ట్రాన్సాక్షన్ క్యాన్సిల్ అవుతుంది.




ఈ రెండు ఆప్షన్లలో ఏది ఎంచుకోకపోతే గంటలోపు డబ్బులు బదిలీ అవుతాయి. చెల్లింపులు చేసేముందు ఒక అలర్ట్ మెస్సేజ్ తరహాలోనే ఇది ఉపయోగపడుతుంది. వినియోగదారులు మరోసారి కరెక్ట్ వ్యక్తికి పంపుతున్నాడా..లేదా అనేది తనిఖీ చేసుకునేందుకు సహాయపడుతుంది. తొందరపాటులో తప్పుడు వ్యక్తికి డబ్బులు పంపించడాన్ని ఇది కొంతమేర అడ్డుకట్ట వస్తుంది. ఈ విధానం తీసుకొచ్చేలా పలు బ్యాంకులు తమ పేమెంట్స్ యాప్స్‌లలో మార్పులను సూచిస్తున్నాయి. పర్సన్ టు పర్సన్ ట్రాన్సాక్షన్ జరిగేటప్పుడు డబ్బు రిసీవర్ ఖాతాలో జమ చేయడానికి ముందు యస్ లేదా నో అనే విధానంలో చెల్లింపుదారుడి ఆమోదం కోరతారు.

రూ.10 వేలకు మించి పంపాలంటే..

యూపీఐ ద్వారా రూ.10 వేలకు మించి పంపుతుంటే గంట వెయిటింగ్ పీరియడ్ వ్యవస్థను ఆర్బీఐ తీసుకురావాలని సూచిస్తోంది. ఈవిధానంలో మనం రూ.10 వేలకు మించి పంపాలంటే గంట తర్వాతనే రిసీవర్ ఖాతాలో పడతాయి. ఆ లోపు మీరు ట్రాన్సాక్షన్ క్యాన్సిల్ చేసుకోవచ్చు. దీనికి ప్రత్యామ్నాయంగా అనేక బ్యాంకులు యస్ లేదా నో అనే ఆప్షన్‌ను సూచిస్తున్నాయి. అయతే రూ.10 వేల పరిమితికి మించి చేసే లావాదేవీలకు "అవును-ఏమీ లేదు" అనే ప్రాంప్ట్‌ను చూపించమని బ్యాంకులు సూచించడం లేదు. తెల్లవారుజామున 2 గంటలకు చేసే లావాదేవీలు, వినియోగదారుడు ఇంతకు ముందు ఎన్నడూ లావాదేవీలు జరపని వారికి చేసే చెల్లింపులు, లేదా కొత్తగా తెరిచిన బ్యాంకు ఖాతాలకు (తరచుగా మనీ మ్యూల్స్ ఉపయోగించేవి) చేసే చెల్లింపులు వంటి అసాధారణ ప్రవర్తనను ప్రదర్శించే చెల్లింపులకు మాత్రమే ఈ ప్రాంప్ట్ కనిపించాలని కోరుతున్నాయి.

Printed , Published and Owned by POLAGONI ALIVELU, and Printed at Smilys Online, 6-7-48, Vanasthalipuram, Shopping Complex, Rangareddy-500070. Telangana State and Published from 17-10-25, Plot No.H.No. 4-136/12, Turkayamjal Journalist Colony, Rangareddy501510, Telangana State. Editor: POLAGONI ALIVELU. PRGI No. TGTEL/25/A3190. Phone No: +91 7989151815